వేట

ఎస్.వి.రంగా

చీకటి. కాటికలాంటి చీకటి. పిరికి వాడి భయంలా చిక్కగా ఉంది. అడవిలో నిశ్శబ్దం భరవసా చూసుకుని మరింత నల్లగా నవ్వుతోంది. ప్రమాద పరిస్థితిలో పసిపిల్లవాడి చిరునవ్వులా నింగిన చుక్కలు అమాయకంగా మెరుస్తున్నాయి. మొహం చెల్లక, కడుపులో ప్రమాదాలు దాచిపెట్టుకున్న చీకటికూడా మిణుగురులతో ఇకిలిస్తోంది. పెద్ద పెద్ద చెట్లు రూపు ధరించిన చీకట్లలా నీలగా కనబడి మాయమవుతున్నాయి.

మంచుకురుస్తోంది. చలి కరుస్తోంది. గాలి సన్నగా వాడిగా రంపపుకోతలా ఒరుసుకుపోతోంది చెవులమీదనుంచి. చోటు దొరికిన చోటల్లా గాఢంగా గుచ్చుకుంటోంది. ఆర్కెస్ట్రాలో అసందర్భపు క్లారినెట్ లా ఎక్కడో నక్కలు అపశ్రుతిగా అరుస్తున్నాయి...భయంగా...భయంకరంగా... ఇలకోడి ఎగురుతాళంలో కూస్తోంది; భయసంగ్రహాలవల్ల లయలేకుండా పడుతున్న మా అడుగుల సవ్వడిని కొబోలు ఆగి ఆగి ఆలకిస్తోంది.

మెయిన్ రోడ్డుమీద నడచిన అలవాటువల్ల కొబోలు దారినిండా ఇన్ని గతుకులేమిటని విసుక్కుంటున్నాయి పాదాలు.

వెనక మేమున్నామన్న ధీమాతో బ్యాటరి లైటుకాంతి కిరణం ఒకటి మా ముందు చెంగు చెంగున ఎగురుతూ పోతోంది. హఠాత్తు మృత్యువులాంటి పెద్దపులులు పచ్చటి ఎర్రటి కనుపాపలు పెద్దవిచేసుకుని ఊపిరి బిగబట్టి పొంచి ఉండే పొదలలోకి కూడా తొంగిచూసి వస్తోంది ఆ కిరణం

ఒక్కక్షణం ఆగాను. ఇంతచలిలోనూ కూడా చిరుచెమటపోసిందినొసట...అలసట చేత...భయంచేతకూడాను. రుమాలుతో మొహంతుడుచుకొని డబుల్ బారెల్ గన్ను ఆ భుజంనుంచి ఈ భుజానికి మార్చుకొన్నాను. అటవిక నిశ్శబ్దం నన్ను చెవిటి వాణ్ణి చేసింది నా వెనుక వస్తున్న నా మిత్రుడు పొడిదగ్గుదగ్గాడు. ఉలికిపడ్డాను.

'ఊఁ!' అన్నాను వెనక్కి తిరక్కుండానే.

'అబ్బే' అన్నాడు అతను.

'చలా?'

'ఊహుఁ'

"భయమెందుకోయ్" అన్నాను భయం అణచుకుంటూ.

అతను నవ్వాడు—ధైర్యం తెచ్చుకొంటూ. (అతనికి ఇదే తొలిసారి.) నాది భయమా?

భయమైతే నేనెందుకు షికారుకు వెళ్లాలి? ధైర్యముంటే అతనెందుకు భయపడాలి? మేము అడవిని చూసి భయపడితే అడవి మమ్మల్ని చూసి ఎందుకు భయపడాలి? అడవిలో పులులు ఎందుకు ముందుకు రావు? చీకటి నిశ్శబ్దంలో, నిశ్శబ్దం చీకట్లో ఎందుకు దాక్కున్నాయి? కుట్ర చేస్తున్నట్లుగా యెందుకీ నిశ్శబ్దం? పొంచి వున్న ఈ 'ప్రమాదాల' మధ్య, మృత్యు పరికరాల మధ్య, అణగి వున్న ఈ ప్రకృతి శక్తి చైతన్యాల మధ్య రంగారావుకు చోటెంత? అణువంత. కాని అణువులో శక్తి ఎంత?...ఆ సంగతి తెలిసే ధైర్యముగా అడవిలోకి ఆరుమైళ్ళ దూరం వచ్చానా?

ఏ ధైర్యం నన్ను ముందుకు నడిపింది? స్వతహా పిరికివాణ్ణి గదా...చేతిలో తుపాకి ఉన్నదన్న ధైర్యం కాబోలు. కాని 'మృత్యువు' గాండ్రుమని గర్జించి మీదకి లంఘిస్తున్నప్పుడు ఎదిరించి కాల్చే సాహసమెంత?

వేట

ఈ రంగారావులో భయమూ వుంది. సాహసమూ ఉంది. భయం కోరి తెచ్చుకున్నది; సాహసంతో ఆవహింపచేసుకున్నది. శత్రువు(?)ని కొట్టేవరకూ "ప్రమాదం" ఎక్కడ పొంచివుండి ఎట్నుంచి మీద పడుతుందోనని భయం. ఆ భయం—అప్పటి ఉత్కంఠ ఒక అద్భుతమైన అనుభూతి. అనిర్వచనీయమైన సుఖం. అదే వేటగాడి కష్టానికి తెగింపుకూ ప్రతిఫలం. ప్రాణం పణంగా ఒడ్డి గెల్చుకొన్న మధురఫలం. అందుకోసమే, ఆ భయంకోసమే సుఖంకోసమే షికారీ వేటకెళ్తాడేమో.

"ప్రమాదం తన పచ్చటి ఎర్రటి కళ్ళతో అమేయమైన శక్తితో తనవేపు గురిచేసిఉన్న తుపాకీకేసీ, ఆ వెనుకనున్న మనకేసి చూసి-గాండ్రుమంటూ అడవి ఝుమ్మనేలా అరచి దూకినప్పుడు—

తుపాకి ట్రిగ్గర్ నొక్కి, అందులోంచి గుండు బయల్దేరి ముందుకు వెళ్తున్నప్పుడు—

పులిపంజా, తెరచిన నోరు, తొమ్మిది అడుగుల భారీశరీరం, చిన్న తుపాకి గుండుకు ఎదురుగా వస్తున్నప్పుడు—

ఆ పులికీ, ఈ బుల్లెట్‌కీ భేటి కుదరక పోతే? ఆ అరక్షణం తరువాత ఏమి జరుగుతుంది అని అరక్షణంసేపు షికారీ నరాలను మెలిపెట్టి దహించివేసే విద్యుదాఘాతం లాటి ఆలోచన—

ఆ దేభయం - అదేసుఖం - ఆ క్షణమే స్వర్గం - ఆ క్షణమే భరింపరాని నరకం. అదే అంతవరకూ వేటగాడు ఎదురు చూచిన ముహూర్తం...

* * *

సాధారణంగా వేటకు వెళ్తే మనం ఎక్కడో భద్రంగా కూర్చుని, పులి వచ్చే

వరకూ కాసుకుని, కొట్టేస్తాం. అది చూచినా దానికి అందని పద్ధతిలో ఉంటాం. విశాఖజిల్లా మన్య ప్రాంతాలలో అడ్డతీగల, ఎర్రకుంట, మర్రిపాకల అడవులలోను, తూర్పుగోదావరిలో జడ్డంగి, కొకరపాడు దగ్గర మంప కగ్గిరా ప్రాంతాలలోనూ నేను నా మిత్రులు అప్పుడప్పుడు వేటకు వెళ్తూనే ఉంటాం. నా సహనటుడు, మిత్రుడు కీ॥ శే॥ ఆర్. నాగేశ్వరరావు కూడా వస్తూ ఉండేవారు.

ఒకసారి అడ్డతీగలలో — పెద్ద వేటగాళ్లతో పోల్చుకుంటే ఏమీ అనుభవం లేనివాడు, అప్పటికి అద్భుతం అనతగ్గ సంఘటన ఒకటి జరిగింది. భోజనాలు చేసి, జెర్కిన్‌లు బిగించి, స్వెట్లర్లు తొడిగి, మఫ్లర్‌లు చుట్టి ఒక జీపులో బయల్దేరాం. నలుగురం. రాత్రి పదకొండున్నర అయింది. నేను ముందు సీటులో కూర్చున్నాను తుపాకి ధరించి. గతుకుల్లో జీప్ నెమ్మదిగా వెళ్తోంది.

* * *

ఎదరి చీకటి. కాటుకలాటి చీకటి. అంతటా నిశ్శబ్దం. మధ్య మధ్య భయంకరంగా అప్రశుతిగా ఎక్కడో నక్కలు అరుస్తున్నాయి. ఇలకోడి ఎడతెగని తాళంలో కూస్తోంది.. జీపు కారు శబ్దాన్ని ఇవీ మిగతా నిశ్శబ్దమూ కలిసి మింగేశాయి కాబోలు, వినబడటమే లేదు.

అంతలో నా మిత్రుడు జీపుకు బ్రేక్ వేశాడు. 'ష్' అన్నాడు నిష్కారణం. ఎదర 15 గజాల దూరాన చోటు తెరిపిగా ఉంది. జీపు హెడ్ లైట్‌ల కిరణాలు నిరసించి మసక బారిపోతున్న చోట లీలగా జంతువు కదలిక కనిపించింది.

నేను ఆలోచించే స్థితిలో లేను. కొత్త. ఉత్సాహం. గబుక్కున తుపాకి (డబుల్ బారెల్ గన్) గురిచేసి ట్రిగ్గర్ నొక్కాను. అడవి, నిశ్శబ్దమూ, నా గుండె, పొదల్లో కుందేళ్ళు, చెట్లమీద పక్షులూ దడదడలాడి పోయాయి తుపాకిమోతకి.

ఒక్క క్షణం నిశ్శబ్దం అంతలో గర్జనతో అరణ్యం మళ్ళీ మారుమోగింది.

నేను గబుక్కున జీపులోంచి కిందకు దూకాను. ఎదిగ ఎదపడ్డ క్లియరింగ్ (తెరిపిగా ఉన్నచోటు) వేపు బయల్దేరాను.

నా మిత్రులు గట్టిగా వారించారు. వినక్కలాగారు, విదిలించుకుపోయాను. నిజానికి అది చాలా మూర్ఖమైనపని... అని ఇప్పుడు తెలుసు. అప్పుడు కొత్త. వేడి దెబ్బతిన్న జంతువు, ఆమాత్రం తెలియకుండా పొంచి ఉన్నపుడు అలా దిగి అటు వేపు పోకూడదు.

నేను మొండి ధైర్యంతో — బహుశా అది అజ్ఞానంవల్ల నిలబడ్డ ధైర్యం అనుకొంటాను — అలా ముందుకు పోతున్నాను.

వెనకాల జీపు వస్తోంది నెమ్మదిగా పది

అడ్డతీగలవద్ద చిరుతపులిని వేటాడిన రంగారావు—మిత్రులతో.

అడుగులతరవాత ఆగిపోయినట్టుంది. నేను వెనక్కి చూడలేదు.

తుపాకిని పొజిషన్‌లో పట్టుకుని — దాని మీద క్లాంప్ చేసిన లైట్‌ను వెలిగించి సర్వేంద్రియాలకూ హెచ్చరిక చెప్పి జాగ్రత్తగా అడుగులు వేస్తూ ఇంకాస్త ముందుకు వెళ్లాను.

నేలమీద ఒకచోట నల్లటి డాగు కనబడింది. పెద్దడాగు. ఆగి పరీక్షగా చూశాను. రక్తం.

అంత భయంలోను గర్వం. గురితప్పకకొట్టగలిగానని. ఆ నందంతో గర్వంతో వెనక్కి చూశాను. అంతలోనే మళ్ళీ నేనున్న స్థితి గుర్తుకొచ్చింది.

చిరుతపులి నాకు కుడివైపునుండి ఎడమవైపుకు పోతూ ఉండగా కొట్టాను. బహుశా దెబ్బతిని ఎదర ఉన్న పొదలలోకి దూకి ఉంటుంది.

ఎక్కడా అలికిడి లేదు.

ఆయాసంగా ఊపిరితీస్తున్న సవ్వడి కూడా లేదు — నాది తప్ప. క్లాంప్‌లాంప్‌ను పొదలమీదకు ప్రసరించి నెమ్మదిగా జరుపుతూ పరిశీలిస్తున్నాను.

అంతలో హఠాత్తుగా నాకుడివైపున దగ్గరగా బాటరీలైటు కిరణం పడింది.

పరాకుగా ఉన్నవాడిపక్కన బాంబు పేలినటయింది. చిక్కటి చీకట్లో ఆవెలుగు కిరణం అలా పగలడంతో గుండె ఝల్లుమంది. కదలకుండానే ఎటూ తిరక్కుండానే తల పక్కకు వాల్చి ఆకిరణంకేసి చూశాను. అది నాపాదాలదగ్గర నుండి కుడివేపుకువెళ్ళి మళ్లీ వెనక్కువచ్చి మళ్ళీ కుడివేపుకు వెళ్తోంది నాకేదో చెప్పాలని నానా హైరానాపడుతూ — నా వెనక జీపులోంచి

నా మిత్రుడువేస్తున్న లైటుఅని తెలుసు. గట్టిగా అరవద్దనీ తెలుసు. అరవడానికి కంఠం పెగల్లేదు.

ఒకడు అలా గాయపడ్డ జంతువును వెదుకుతూ ఉండగా వెనకనించి మరొకడు అలా లైటు వెయ్యకూడదు. అలాచేస్తే పొంచిఉన్న జంతువుకు ఇతను స్పష్టంగా కనబడిపోతాడు.

అది ప్రమాదమని నా మిత్రులకు నాకన్న బాగా తెలుసు. గత్యంతరం లేకనే ఈ పని చేస్తూ ఉండి ఉండాలి.

నేను నిలబడ్డ చోటు వైశాల్యం పది దవరపు గజాల లోపు

కాంతి కిరణాన్ని అనుసరిద్దామని ఆ ప్రకారం దాని వెంటే వెనక్కి తిరిగి, నా తుపాకీమీద బాటరీ లైటు పొదలవేపు వేసి చూశాను. అంతే. ఇప్పుడంతా అర్థమైంది.

ఆ లోపలే గుండె ఝులుమంది. క్షణంలో ఒళ్ళు కొయ్యబారి పోయింది. ఒక్కసారిగా విడివడింది. అంత చలిలోను ముచ్చెమటలూ పోసేశాయి నా ఎదురుగుండా 20 అడుగుల దూరంలో పొద పక్కన కూర్చుని ఉంది — దెబ్బ తిన్న చిరుతపులి. దూకడానికి సిద్ధంగా ఉన్నట్టు కూర్చుంది.

నాకేమీ తోచలేదు. ఆలోచనకు అవకాశమూ లేదు. వస్తున్నా ఆక్షణంలో ఆగుకోలేరు. కాపాడలేరు.

ఆక్షణంలోనే ఒళ్లు తెలియకుండా ఆలోచన లేకుండా బాటరీ దాని మొహం మీద వేశాను. ఆ కాంతికి చిరుతపులి ఒక్కమాటు కళ్ళు ముడుచుకుంది. కళ్లు చీకట్లు కమ్మి ఉండాలి. అది కళ్ళు తెరిచి తమాయించు

వేట

కుంటే తరవాత ఆ దెబ్బతిన్న పులిని అడ్డేవాడుండడు.

నా దగ్గర తుపాకిలో ఇంక ఒక్కటే గుండు ఉన్న సన్నివేశం కూడా స్ఫురించింది. అయితే ఒకటే ధైర్యం. గుండు గురితప్పి, అది మీదకు ఉరికినా ఒక్క ఆశ ఉంది. అది పెద్దపులి కాదు. చిరుతపులి కాబట్టి కలియబడవచ్చు. అప్పుడు జయాపజయాలు-ఏమో.

ఒక పక్క చెమటలు పోస్తున్నాయి. మరో పక్క ఒళ్ళు గజగజ వణికిపోతోంది. తెగించి, గురిపెట్టి కాల్చాను.

తుపాకి శబ్దానికి అడవి మారుమోగింది... కాని దానికి ప్రతిధ్వనిగా గర్జన వినరాలేదు మూలుగులాటిది వినబడింది. పులి నా మీద దూకలేదు. పొద అదిరిపోలేదు. ఇక ఫరవాలేదు అది దెబ్బతింది అనుకున్నాను.

గబగబ పెద్దపెద్దఅంగలు వేస్తూ జీపు వేపు నడిచిపోయాను.

నా మిత్రులు ముగ్గురూ అమాంతం ఎదురువచ్చి కౌగలించుకున్నారు. కారులో కూర్చోపెట్టి మొహం తుడిచారు. కాంగ్రాట్యులేషన్స్ కురిపించారు. ఫ్లాస్కులోంచి వెచ్చటి టీ తీసిఇచ్చారు. అది తాగి సిగరెట్ ముట్టించాను. కసితీరా రెండు పీల్పులు పీల్చాక ప్రాణం కుదుటపడింది. ఎవరితోను మాట్లాడ బుద్ధికావటంలేదు. చెప్పరానంత ఆనందంగా గర్వంగా హాయిగావుంది. కన్నులరమూసి కూర్చున్నాను.

పావుగంట తరవాత, వాళ్ళతో వెళ్ళి నేను చంపిన చిరుతపులిని సాయంపట్టి జీపు బానెట్ మీద పడేశాను.

తృప్తిగా కూర్చున్నాను. జీపు అడ్డతీగల గ్రామంవేపు సాగిపోతోంది నెమ్మదిగా.

మిత్రులు, నేనెంత మూర్ఖపుపని చేసిపోయానో, ఎంతటిగండం తప్పిందో చెబుతున్నారు. క్రమంగా అవన్నీ వినబడడం మానేశాయి. వాళ్ళసంతోషం పంచుకోలేకపోతున్నాను. నేను సాధించిన విజయం ఏమిటి?

పగ సాధించానన్న ఈ తృప్తి ఎందుకు కలగాలి? పగ ఎందుకు వచ్చింది? పులికి నా మీద కోపం ఉన్నట్టు ఎవరూ చెప్పలేదు. నాకూ దాంతో పరిచయం లేదు. పనిమల్లె నేను ఇక్కడికి దాని రాజ్యంలోకి ప్రవేశించాను. నేనే శత్రువుని. దానిదారిన అది పోతూఉంటే, హెచ్చరించకుండా దెబ్బ కొట్టాను. నాకన్న అది బలమైనదని తెలుసు. ధైర్యం ఎక్కువనీ తెలుసు. నాకు అదంటే భయమనీ తెలుసు. మరొక్కటి తెలుసు. అది జంతువని దానికి బుద్ధిబలం లేదనీ, వంచనాశిల్పం బాగా తెలీదనీ, నేను నాగరిక మానవుడననీ, దానికిలేని బుద్ధిబలం నాకుఉందనీ పైగా వంచనాశిల్పం, ఆయుధసంపద నా అధీనంలో ఉన్నాయనీను. అదే, పంజా ఎత్తిన పులికాక. తుపాకి పట్టిన మరోమనిషి అలాగే ఆ పొదలో నిలిచిఉంటే? నేనూ అతడూ సమానస్థాయిలో ఉందుము. అపుడు ఎవరేమయ్యేవారో!

నేను నిరాయుధుడనై వెళ్తే పులి నన్ను బలిచేస్తుందని ఊహించి, నాకన్న అది బలశాలి అని గుర్తించి, దానికి తెలీకుండా, అది నాతో సవాలు చేసినట్టు అనుకుని, ప్రతీకారం కోసం అయినట్టు పనిమల్లె వెళ్ళి చంపాను. కాని ఇది ప్రతీకారమా, నాలోని అహంకారానికి ఉపశమనమా? ఏమో.

తెలీదు... తెలుసుకోవడం ఇష్టం ఉండదు. అది తెలుసుకుంటే, నేను చాలా ధైర్యశాలిని అని నెన్ను చరచుకోడానికి అవకాశం ఉండదనా? ఏమో...

*　　*　　*

"వాట్ రంగరావ్...ఏమిటలా ఉన్నావు." అంటున్నారెవరో

"కొత్తగదయ్యా...గోను పోను అతనే సర్దుకుంటాడు." అంటున్నారింకెవరో

*　　*　　*

జీపు ఊరి వేపు-నాగరికత వేపు-సంస్కారం వేపు—ముందుకు సాగిపోతోంది.... ★

"అమ్మా పొద్దున్ననగా పోయిన నాన్న మధ్యాన్నం దాకా రారుకదా మరి టిఫిన్ తినరూ, తినకుండా పోయారు మరి!" అంటూ అడిగాడు ఓ అబ్బాయి వాళ్ళమ్మని. "ఆయన ఏ హోటల్లోనో తింటారులేరా" అంది తన కొడుక్కి తండ్రి అంటే ఎంతఇష్టమో అని మురిసిపోతూ. "అయితే నాన్నకోసం టిఫిన్ దాచట మెందుకు నాకిచ్చెయ్" అన్నాడు ఆ కుమారరత్నం.

సి. వి. రఘుమూర్తి.